ప్రాథమిక పాఠశాలకు విరాళం



కీసర: మై కంప్లెస్ట్స్ ఆఫీస్ (ఎంసీఓ) సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం అహ్మద్ గూడలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కుర్చీలు, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, ఎలక్ట్రిక్ బెల్, టీవీ, ప్రింటర్, మైక్, మ్యూజిక్ సిస్టమ్, స్టేషనరీ వస్తువులు, క్రీడా వస్తువులు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ జమదగ్ని చేతులమీదుగా విద్యార్థులకు వివిధ వస్తువులను అందజేశారు. ఎంసీవో మేనేజర్ బాపిరాజు, కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి బోనాలు



ఘట్‌కేసర్: కొండాపూర్‌లో ముదిరాజ్‌ల ఆరాధ్యదైవం పెద్దమ్మ తల్లి బోనాలు శనివారం ఘనంగా నిర్వహించారు. బోనాలను పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించారు. గ్రామంలో నుంచి అమ్మవారి ఆలయం వరకు డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లారు. బోనాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రైల్వే వంతెన బాధితులతో కమిషనర్ సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ రాజేష్, పావనీజంగయ్య

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన బాధితులతో మున్సిపల్ కమిషనర్ రాజేష్ సమావేశం నిర్వహించారు. ఆర్టీసీబస్సులు, ప్రైవేటు వాహనాల రాకపోకలకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నష్టపరిహారం పొందడానికి కోర్టుకు వెళ్లిన బాధితులు సహకరించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య కోరారు. యంనంపేట్ చౌరస్తా నుంచి మాధవరెడ్డి రైల్వే వంతెన వరకు నిర్మిస్తున్న రోడ్డు విస్తరణలో భాగంగా దుకాణాల ఎదుట యజమానులు నిర్మించుకున్న షెడ్లను సొంతంగా తొలగించుకోవాలని కోరారు. టీపీఓ రాజీవ్‌రెడ్డి, శివప్రదీప్‌రెడ్డి, మల్లేష్, ఆంజనేయులు, ఫరూక్, మహేష్, ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సాయి, అరుణ్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన



పాపయ్యనగర్‌లో పర్యటిస్తున్న అధికారులు

జవహర్‌నగర్: కార్పొరేషన్ 12వ డివిజన్‌లో పాపయ్యనగర్ కాలనీలో వర్షం పడిన ప్రతిసారి చెన్నాపురం చెరువు నిండి అలుగు పారి పాపయ్యనగర్‌లో వరదనీరు ప్రవహిస్తోంది. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల స్పందించి వర్షాకాలం దృష్ట్యా పాపయ్యనగర్‌లో సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఇరిగేషన్ డీఈఈ ఉదయ్‌భాస్కర్, మున్సిపల్ అధికారులతో కలిసి పాపయ్యనగర్‌లో పర్యటించారు. సమస్యకు పరిష్కారంతో పాటు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. మున్సిపల్ అధికారులు, బీజేపీ అధ్యక్షులు కమల్, నాయకులు మహేందర్‌యాదవ్, సంతోష్‌గుప్తా, రామ్‌నాయక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఇన్వెస్టిచర్ సెరిమని'

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ సెరిమని వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య హాజరై మాట్లాడారు. స్కూల్‌లో నూతన విద్యార్థుల మండలి ప్రమాణ స్వీకారం చేశారు. వారిని ఆయన అభినందించారు. డైరెక్టర్ సుశీల్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ వైష్ణవి, హెచ్.ఎం. నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. వేణుగోపాల్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఈగిల్ తదితరులు పాల్గొన్నారు.



పశువైద్యశాల వద్ద చెత్త,చెదారం



వర్షంలో చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

వద్దంటే వినరే..!

రోడ్డుపై ఇష్టానుసారంగా వ్యర్థాల పారబోత

- చెత్తతో దుర్వాసన వెదజల్లుతున్న వైనం
- అనారోగ్యం భారిన పారిశుద్ధ్య కార్మికులు

ఘట్‌కేసర్: రాత్రి, పగలు తేడా లేకుండా వీధుల్లోని చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నారు పారిశుద్ధ్య కార్మికులు. పట్టణమంతా పరిశుభ్రంగా ఉండాలని అనారోగ్యం భారిన పడుతున్నా.. విధి నిర్వహణలో గాయాలైన విశ్రాంతి తీసుకోలేరు. కానీ పారిశుద్ధ్య కార్మికుల కష్టానికి తగిన సహకారం లభించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యథేచ్ఛగా రోడ్లపై వ్యర్థాలను పారబోస్తు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారు.

ఎక్కడపడితే అక్కడ చెత్త..

మున్సిపాలిటీలోని ఇళ్లల్లో చెత్తను సేకరించడానికి స్వచ్ఛ వాహనాలు ఏర్పాటు చేశారు. ఉదయం నిద్రలేవగానే వారు కాలనీల్లో ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరిస్తారు. నెలనెలకు డబ్బులు చెల్లించాల్సి వస్తుందని కొందరు. ఉద్యోగాలకు వెళ్లేవారు చాలా మంది ఇంట్లోని వ్యర్థాలను ఇష్టానుసారంగా పారబోయడంతో రోడ్లపై చెత్త పేరుకుపోతుంది.

భరించలేని దుర్వాసన...

జంతువుల కళేబరాలు వర్షానికి తడిసి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తమ చేతులతో తొలగిస్తారు. దీంతో వ్యర్థాల దుమ్ము, ధూళితో వారు అనారోగ్యం భారిన పడుతుంటారు. వారి వేతనంలో సింహభాగం ఆసుపత్రుల పాలవుతోంది.

ప్లాస్టిక్ బ్యాగులతో ముప్పు...

పట్టణంలోని వీధుల్లో చెత్త పేరుకుపోవడానికి ప్లాస్టిక్ బ్యాగులు ఓ కారణభూతం అవుతుంది. ఉద్యోగాలకు వెళ్లేవారు ఇళ్లలోని వ్యర్థాలను ప్లాస్టిక్ బ్యాగుల్లో నింపి ఇతరుల ఇళ్ల ముందు, వీధుల్లో పారవేస్తున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో చెత్త నింపిన బ్యాగులు వాహనం పైనుంచే పారవేస్తున్నారు. చెత్తను రోడ్డుపై వేయడానికి ప్రధాన సాధనం ప్లాస్టిక్ బ్యాగులే. ఎవరూ చూడకుండా చెత్తను పారవేయడాన్ని ఇది సులభం చేస్తుంది. చెత్తలో ఎక్కువగా ప్లాస్టిక్ బ్యాగులే దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ బ్యాగులు నిషేధిస్తే సగం చెత్త తగ్గుతుందని పలువురు సూచిస్తున్నారు. రోడ్లపై చెత్త వేస్తున్న వారిపై తీసుకుంటున్న చర్యల గురించి మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ప్రజలందరూ సహకరించాలి..



మున్సిపాలిటీలో నిత్యం చెత్తకుప్పలు తొలగించినా తిరిగి వేస్తున్నారు. చెత్తకుప్పలు లేని మున్సిపాలిటీగా కనిపించాలంటే ప్రజలు సహకరించాలి. ప్రజల సహకారం లేకుండా అది సాధ్యం కాదు.

\- ధర్మేందర్, సూపర్‌వైజర్ ఘట్‌కేసర్

రోడ్డుపై చెత్త వేయకూడదు..



రోడ్లపై చెత్త వేయకూడదని ఎన్నిసార్లు చెప్పిన ప్రజలు వినడం లేదు. వ్యర్థాలతో ప్రజలందరి ఆరోగ్యం దెబ్బ తింటుంది. వర్షాకాలంలో చెత్తను తొలగించే సమయంలో దుర్వాసన భరించలేకపోతున్నాం.

\- జంగమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు ఘట్‌కేసర్

కార్మికుల శ్రమను గుర్తించాలి...



ఇంట్లోని వ్యర్థాలు, జంతువుల కళేబరాలు, ఇతర చెత్త,చెదారం తొలగించే పారిశుద్ధ్య కార్మికుల శ్రమను మనమందరం గుర్తించాలి. దుర్వాసన రావొద్దంటే చెత్తను రోడ్డుపై వేయకూడదు. పరిశుభ్రత మనందరి బాధ్యత.

\- సిరాజ్, మాజీ వార్డు సభ్యుడు

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా



పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

శామీర్ పేట్: పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. శనివారం శామీర్‌పేట్‌లోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూ శారదతో కలిసి అదనపు కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో ఆమె మాట్లాడారు. భారీగా వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించేందుకు రాజీ పడొద్దని వారికి సూచించారు. స్కూల్ గదులు, వంటగది, పాఠశాల పరిసరాలను అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. మరమ్మతులకు కావాల్సిన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు సూచనలు చేశారు. విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు .

ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్ల పరిశీలన..

శామీర్ పేట్: స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. శనివారం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో మహిళాశక్తి గ్రూపులచే ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్లను మున్సిపల్ కమిషనర్ జ్యోతితో కలిసి ఆమె సందర్శించారు. స్టాళ్లలో ఏర్పాటు చేసిన పలు వంటకాలను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం చేయుటకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందిస్తుందన్నారు. దీనిలో భాగంగా మహిళాశక్తి గ్రూపులకు క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. మున్సిపల్ ఇంజినీర్లు స్వయం సహాయక సంఘాల సభ్యులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ చోరీ నిందితుల రిమాండ్

3 ల్యాప్‌టాప్స్, 12 సెల్‌ఫోన్ల రికవరీ

మేడిపల్లి: ల్యాప్‌టాప్స్, సెల్‌ఫోన్లను దొంగిలించే ముగ్గురు నిందితులకు రిమాండ్ విధించారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన మాధురి శ్రీలక్ష్మి(24)తన స్నేహితురాలితో కలిసి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కెనరానగర్‌లోని జీఎంఆర్ గల్స్ హాస్టల్‌లో ఉంటూ.. ప్రైవేట్ జాబ్ చేస్తుంది. ఈనెల 20న తన రూంలో 3 ల్యాప్‌ట్యాప్‌లు కనిపించకపోవడంతో మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. సీసీపుటేజీ ద్వారా నిందితులను గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల విచారణలో నిందితులు కర్ణాటక రాష్ట్రం శివమొగ్గకు చెందిన దీపిక(27)బస్వరక(21)సూర్య(22)లుగా గుర్తించారు. హైటెక్ సిటీలో కూడా 12సెల్ ఫోన్లను దొంగిలించినట్లు విచారణలో తేలింది. నిందితుల నుంచి 3 ల్యాప్‌టాప్స్, 12సెల్ ఫోన్లను రికవరీ చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి తెలిపారు.

పన్నులపై ఉన్న శ్రద్ధ..

పనులపై లేదా ?

చిన్నపాటి వర్షాలకే చిత్తడిగా రోడ్లు

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- వీధిలైట్లు వెలగక తరచుగా రోడ్డు ప్రమాదాలు
- నగర శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో.. 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 27 మున్సిపాలిటీలు



కాప్రా సర్కిల్ వద్ద గుంతల మయంగా రోడ్డు

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలోని పురపాలికల్లో పాలక వర్గాలు లేకపోవటంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. పుర యంత్రాంగం చేతివాటంపై చూపిస్తున్న శ్రద్ధ సమస్యల పరిష్కారంపై చూపడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

◆ చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తే లోతట్టు ప్రాంతాలు, మురికివాడలు వరదమయంగా మారుతుండగా.. రోడ్లన్నీ అస్తవ్యస్తంగా నడవలేని స్థితికి చేరుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు పురపాలికల్లో రహదారులపై వీధిలైట్లు వెలగకపోవడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి.



పోచారంలో..

ముక్కు పిండి వసూళ్లు..

నగర శివారుల్లో బోడుప్పల్, పీర్జాదిగూడ నిజాంపేట్, జవహర్‌నగర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్ ,బండ్లగూడ నగర పాలక సంస్థలు ఉండగా.. దమ్మాయిగూడ, నాగారం,పోచారం, ఘట్‌కేసర్, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, పెద్ద అంబర్‌పేట్,తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, షాద్‌నగర్, శంషాబాద్, శంకర్‌పల్లి, తుర్కంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, అమనగల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ నగరాలు, పట్టణాల్లో ముక్కు పిండి ఏటా వివిధ పన్నుల రూపేణా దాదాపు రూ. 700 కోట్లకు పైగా వసూలు చేస్తున్నారు. ఒక్క మేడ్చల్ జిల్లా పరిధిలోని 16 పురపాలిక సంఘాల్లో పన్నుల రుపేణా రూ.385 కోట్లు ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. సంబంధిత యంత్రాంగం మాత్రం ప్రజలకు సేవలు అందించటంలో విఫలమవుతున్నారనే విమర్శలను ఎదుర్కొంటోంది.

◆ నగర శివారులో ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో లోతట్టు కాలనీవాసులు నానా ఆగచాట్లకు గురయ్యారు. కాప్రా తహసీల్దార్ కార్యాలయం నుంచి చెన్నాపూర్ చౌరస్తా వరకు ఉన్న ప్రధాన రహదారిపై మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడి వరద నీరు చేరడంతో రాకపోకలు సాగిస్తున్న వందలాది మంది ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మిగతా మున్సిపల్ సర్కిళ్లు ,శివారుల్లో పలు పురపాలక సంఘాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

◆ పురపాలికల్లో జనన, మరణ ధ్రువీకరణపత్రాలతో సహా మ్యూటేషన్, ట్రేడ్ లైసెన్సుల జారీ వంటి పత్రాల కోసం ఆయా పట్టణాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపనికి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

జిల్లా కోర్టు సముదాయాల మార్పు

ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తులు



ప్రారంభోత్సవంలో జస్టిస్ అభినందన్‌కుమార్ శావ్లీ, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి

మేడ్చల్: మున్సిపాలిటీలోని అత్వెల్లిలోని 8వ ఫస్ట్ క్లాస్ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్, 10వ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్, కోర్టులను మేడ్చల్ కోర్టు ఆవరణలోకి మార్చారు. శనివారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభినందన్‌కుమార్ శావ్లీ, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డిలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. వరకట్న వేధింపులు, గృహహింస, భరణం కేసులు, పోక్సో తదితర కేసులను న్యాయవాదులు సామాజిక కోణంలో చూసి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైందని, ఆ గౌరవాన్ని కాపాడుతూ వృత్తిలో రాణించాలన్నారు. పెండింగ్ కేసులను తగ్గించేందుకు న్యాయవాదులు కృషి చేయాలన్నారు. యువ న్యాయవాదులు సాంకేతికతను ఉపయోగించుకుని కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. బార్ అసోసియేషన్ కృషితో మేడ్చల్‌లోని అన్ని కోర్టులు ఒకే సముదాయంలోకి వస్తున్నాయని, ఇదే విధంగా పనిచేస్తే అన్ని కోర్టులు ఒకే భవనంలోకి వస్తాయని స్పష్టం చేశారు. జిల్లా న్యాయమూర్తి ఎస్ఎన్. శ్రీదేవి, అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కార్యదర్శి విజయ్‌గోపాల్‌రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మాజీ చైర్‌పర్సన్ పావని, కాంగ్రెస్ నేత ముత్యాలు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 6,11వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ఆధ్వర్యంలో శనివారం పనులు ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని, పేదలు సొంతింటి కల నెరవేరనుందన్నారు. యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లేష్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, మైనారిటీ అధ్యక్షుడు ఫరూక్, సిరాజ్, ఖయూమ్, ఖలీం, బాబు, రాజు, సల్మాన్, రాజు, బాలకష్ణ, సాయి, వార్డు ఇన్‌చార్జ్ సాయి పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న కమిషనర్ వెంకట్‌రెడ్డి

కీసర: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు సాయిప్రియ కాలనీలో వనమహోత్సవంలో భాగంగా కమిషనర్ వెంకట్‌రెడ్డి మొక్కలు పంపిణీ చేశారు. డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన, ఇంటింటికీ తడి, పొడి వ్యర్థాల వేరు చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. డీఈఈ బాలమురళి, మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్స్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ..

కీసర: క్రాంతి కిస్ ఫౌండేషన్ స్కూల్ ఆధ్వర్యంలో పచ్చదనం పెంపొందించేందుకు ×మొక్క నాటుదాం– గిఫ్ట్ పొందుదాం॰ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరికీ మొక్కలను అందజేయడంతో పాటు, వాటిని నాటి సంరక్షించేలా తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందని క్రాంతికిస్ ఫౌండేషన్ స్కూల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో స్కూల్ విద్యార్థులతో ప్రజలకు మొక్కలను పంపిణీచేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొక్కలు నాటి సెల్ఫీ పంపిన వారికి ర్యాండమ్ లక్కీడ్రా ద్వారా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. స్కూల్ జనరల్ సెక్రటరీ పీఎస్ఆర్ క్రాంతి, డైరెక్టర్ లావణ్య, ప్రిన్సిపాల్ కల్యాణి, హెచ్ఓడీ జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కులకు భంగం కలిగిస్తే సహించబోం

ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



సేవాలాల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటయ్య

పోచారం: గిరిజనుల హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల్, లక్ష్మీనగర్ కాలనీలో సేవాలాల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజనుల హక్కులకు భంగం కలిగిస్తే ఎంతటి వారికైనా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా బంజారాలు ఎంతో భక్తిశ్రద్ధలతో సేవాలాల్‌ను ఆరాధిస్తారన్నారు. అలాంటి మహనీయుని విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం హర్షణీయమన్నారు. కమిషన్ సభ్యుడు రమావత్ రాంబాబునాయక్, ఎస్సీ,ఎస్టీ హక్కుల పరిరక్షణ రాష్ట్ర అధ్యక్షుడు రమణ, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప, ఓయూ జేఏసీ అధ్యక్షుడు చంటి నాయక్, బహుజన ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ సుమన్, అధ్యక్షుడు రణం, ప్లాటు యజమాని బానోతు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు



కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న యూత్ కాంగ్రెస్ నేతలు



ఇన్‌స్పెక్టర్ పరశురాంకు ఫిర్యాదు చేస్తున్న సంజీవరెడ్డి తదితరులు

కీసర: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై యూత్ కాంగ్రెస్ నేతలు శనివారం కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సీఎం రేవంత్‌రెడ్డి గౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయని, దీంతో ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నాగారం మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అఖిలాష్‌రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కందాడి శ్రవణ్‌రెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ అరవింద్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: సీఎం రేవంత్‌రెడ్డిని దూషించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు బొక్క సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పరశురాంకు శనివారం ఫిర్యాదు చేశారు. కార్తీక్‌యాదవ్, రఫీయుద్దీన్, కృష్ణ, సల్మన్‌రాజ్, సాయికుమార్ పాల్గొన్నారు.

జవహర్‌నగర్: సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లాలోని జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ సైదయ్యకు యూత్ అధ్యక్షుడు మాట్ల శ్రీనివాస్, దమ్మాయిగూడ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రావణ్‌రెడ్డిల ఆధ్వర్యంలో శనివారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నాయకులు అజయ్, వంశీ తదితరులున్నారు.

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఘట్‌కేసర్: పట్టణంలోని బాలాజీనగర్‌లో నూతనంగా నిర్మించిన రేణుకాఎల్లమ్మ ఆలయంలో రేణుకా ఎల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ బలరాంముదిరాజ్ ఆధ్వర్యంలో శోభాయాత్రకు ముఖ్యఅతిథిగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక రాధాకృష్ణ ఆలయం నుంచి రేణుకా ఎల్లమ్మ విగ్రహం ఊరేగింపుగా తీసుకొచ్చారు.